మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏ(క్రాలు)రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరు తో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

సదరమ్ హోం నుంచి నిందితురాలు పరారీ?

వినాయక్‌నగర్, అక్టోబర్ 1: చోరీ కేసులో నిందితురాలిగా ఉన్న ఓ మహిళను సదరమ్ హోంలో ఉంచగా అక్కడి నుంచి ఆమె పారిపోయినట్లు తెలిసింది.వివరాలు.. మాక్లూర్ మండలం ఒడ్డెట్‌పల్లికి చెందిన ఓ మహిళ తమ గ్రామానికి వెళ్లేందుకు గత నెల 27న నిజామాబాద్ నగరంలోని బస్టాండ్ వద్ద ఓ ఆటోరిక్షా ఎక్కింది. అప్పటికే అందులో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఆటో రిక్షాను డ్రైవర్ కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు నుంచి గౌతంనగర్ వైపు మళ్లించగా.. అందులో ఉన్న ఇద్దరు మహిళలు ప్రయాణికురాలి మెడలోని బంగారు పుస్తెల తాడును తెంపుకొని, ఆమెను ఆటోరిక్షాలోంచి కిందకు నెట్టేసి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ ఎస్సై మహేశ్ దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టే క్రమంలో రాత్రి కావడంతో వారిని స్థానిక గౌతంనగర్‌లో ఉన్న సదరమ్ హోంలో ఉంచారు. అయితే ఇద్దరిలో నుంచి ఓ నిందితురాలు సదరమ్ హోం ఇన్‌చార్జి కండ్లు కప్పి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిసింది. పోలీసులు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి మళ్లీ పట్టుకున్నట్లు సమాచారం. దీనిపై త్రీ టౌన్ ఎస్సైను వివరణ కోరగా.. పట్టుబడిన మహిళా నిందితులు ఇద్దరు సదరం హోంలోనే ఉన్నారని పేర్కొన్నారు.

మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ

ముప్కాల్ అక్టోబర్ 1: మెండోరా మండలంలోని దూదిగాంలో మహిళ మెడలో నుంచి పుస్తెల తాడును అపహరించినట్లు మెండోరా ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మెండోరా మండలంలోని దూదిగాం జాతీయ రహదారి 44 ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నంద స్వప్న మెడ నుంచి రెండు తులాల బంగారు గొలుసు బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కొని ఆర్మూర్ వైపు వెళ్లారు. నిర్మల్ జిల్లా గొల్లపేటకు చెందిన స్వప్న కుమారుడు దూదిగాం సీఎస్ఐ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు తన కుమారుడిని ఇంటికి తీసుకెళ్లేందుకు స్వప్న వచ్చింది. తిరిగి వెళ్తుండగా బస్టాండ్ సమీపంలో బంగారు గొలుసు చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పశువుల పాక నుంచి ఆవు, దూడలు ..

రెంజల్, అక్టోబర్ 1: కందకుర్తిలో పశువుల పాకలో కట్టివేసిన ఆవు, దూడలను దుండగులు సోమవారం రాత్రి అపహరించుకుపోయారు. కందకుర్తి – ధర్మాబాద్ మార్గంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న పశువుల పాకలో కట్టేసిన గిరి, జర్సీ జాతికి చెందిన రెండు ఆవులు, ఒక దూడ తాళ్లను కోసుకొని దుండగులు పారిపోయారు. వాటి విలువ రూ. లక్షా 50వేలు ఉంటుందని బాధిత రైతు నూనెల మల్లేశ్ తెలిపారు. బాధిత రైతు మంగళవారం ఫిర్యాదు చేయగా చేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పశువుల పాక ప్రాంతంలో సీసీ కెమెరాల్లో రికార్డయిన పుటేజీలు పరిశీలించారు. ఆధారాలను సేకరించారు.

కొరియర్ షాపులో..

ఆర్మూర్‌టౌన్,అక్టోబర్1: పట్టణంలోని బృందావన్ టాకీస్ పక్కన హజారి కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న బ్లూడాట్ కొరియర్ షాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. కొరియర్‌కు సంబంధించిన రూ.80వేల విలువ గల వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

నగరంలో గంజాయి పట్టివేత

వినాయక్‌నగర్, అక్టోబర్ 1: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎండు గంజాయి పట్టుబడగా..ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం స్థానిక బర్కత్‌పుర కాలనీలో మునీర్,అఫ్రోజ్ ఇద్దరిని పోలీసులు తనిఖీ చేయగా.. వారి వద్ద నుంచి వంద గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై టూ టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్‌ను వివరణ కోరగా ఇంకా విచారణ కొనసాగుతున్నదని, విచారణ పూర్తి అయిన అనంతరం అన్ని వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

సైబర్ కేసును ఛేదించిన పోలీసులు

ముప్కాల్,అక్టోబర్ 1: రెండు నెలల క్రితం నమోదైన సైబర్ నేరం కేసును పోలీసులు ఛేదించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆగస్టు 3న ఆన్‌లైన్‌లో రూ.1,14,998 పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే స్థానిక ముప్కాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు స్పందించి ఆ డబ్బులను రికవరీ చేశారు. ఇందులో సైబర్ వారియర్ పీసీ సాగర్ ముఖ్యపాత్ర పోషించారు. మంగళవారం బాధితుడి ఖాతాలో ఆ డబ్బు జమ చేశారు. పీసీ సాగర్‌ను ఎస్సై రజనీకాంత్ అభినందించారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పక్కాగా చేపట్టాలి

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి, సీఎస్ శాంతి కుమారి ఆదేశం

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

కంఠేశ్వర్, అక్టోబర్ 1: రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డులను జారీ చేసేందుకు ప్రయోగాత్మకంగా ఈ నెల 3 నుంచి పైలట్ ప్రోగ్రాం కోసం చేపట్టనున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. మంగళవారం వారు హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు, భూముల క్రమబద్ధీకరణ సత్వర పరిష్కారం, డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రతి నియోజకవర్గ పరిధిలోని రెండు గ్రామాల్లో ప్రయోగాత్మక సర్వే నిర్వహించాలని సూచించారు. అర్బన్ నియోజకవర్గాల్లో రెండు వార్డులు/డివిజన్లను ఎంపిక చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి, ఈ నెల 8లోగా సర్వేను పూర్తిచేయాలన్నారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇండ్లను దసరా కానుకగా అర్హులైన వారికి కేటాయించడానికి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రస్తుత వానకాలానికి సంబంధించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలన్నారు సన్నరకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ నాటికి ప్రతి మండలంలో కనీసం ఒక్క కొనుగోలు కేంద్రాన్ని తప్పనిసరిగా ప్రారంభించాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్,బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్,రాజాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు జీవన భృతి అందించాలి

ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

ఆర్మూర్‌టౌన్,అక్టోబర్1: బీడీ కార్మికులకు జీవన భృతి అందించాలని డిమాండ్ చేస్తూ ఆలూర్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులందరికీ రూ.4016 జీవన భృతి అందించాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు ఏడు లక్షల మంది బీడీ పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యదర్శి నుంచి టీచర్‌గా..

రెండు ఉద్యోగాలకు ఎంపికైన చందర్ రాథోడ్

చందర్ రాథోడ్

డిచ్‌పల్లి, అక్టోబర్ 1 : రెండురోజుల క్రితం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో సుద్దులం తండాకు చెందిన దేవసోత్ చందర్ రాథోడ్ సత్తాచాటాడు. సాంఘిక శాస్త్రం విభాగంలో జిల్లాస్థాయిలో 37, ఎస్టీ కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించాడు. మరోపక్క ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లోనూ జోనల్ స్థాయిలో 1519, కేటగిరిలో 6వ ర్యాంకు సాధించాడు. ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో పలువురు అభినందించారు. చందర్ రాథోడ్ ప్రస్తుతం తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 2018లో పంచాయతీ కార్యదర్శి ఫలితాల్లో ఉద్యోగం సంపాదించి దాదాపుగా రెండేండ్ల పాటు రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేశాడు. అనంతరం డీఎస్సీ పరీక్షల నిమిత్తం పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాన్ని పక్కన పెట్టి, కష్టపడి సన్నద్ధమై స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

డీఎస్సీలో రాయకూర్ వాసికి రెండో ర్యాంకు


మహేశ్

రుద్రూర్, అక్టోబర్ 1: రెండురోజుల క్రితం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన ఎత్తినోల్ల మహేశ్ రెండో ర్యాంకు సాధించాడు. లాంగ్వేజ్ పండిట్ తెలుగులో 69.67 మార్కులతో రెండో ర్యాంకు రాగా.. గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

పండుగలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 1: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీ రెడ్డి మంగళవారం తెలిపారు. నిజామాబాద్ నుంచి జేబీఎస్, జేబీఎస్ నుంచి నిజామాబాద్ వరకు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు అదనంగా మరో 482 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. రీజియన్‌లోని ఆరు డిపోలు నిజామాబాద్–1, నిజామాబాద్–2, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ, కామారెడ్డి నుంచి జేబీఎస్ వరకు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇతర ప్రధాన రూట్లలో కూడా ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ కోసం www.tsrtcoline.in వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. ఆర్మూర్ 7382843133, బోధన్ 9849500725, నిజామాబాద్ 9959226022, బాన్సువాడ 9491105706, కామారెడ్డి 8468220281 నంబర్లను సంప్రదించాలని కోరారు. తిరుగు ప్రయాణంలో కూడా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సిబ్బంది నిరసన

మోర్తాడ్, అక్టోబర్ 1: రామగుండంలో నూతనంగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పోచంపాడ్‌లోని జలవిద్యుత్ కేంద్రం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విద్యుత్ కేంద్రం ప్రధానగేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు రఫీక్, సతీశ్, భరత్ మాట్లాడుతూ...రామగుండంలో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో, సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని దానిని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. నూతన ప్రాజెక్ట్‌లో సింగరేణి భాగస్వామ్యాన్ని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సురేశ్, వేణుగోపాల్, చంద్రశేఖర్, ప్రవీణ్, వినోద్, నాగార్జున, రాందాస్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు

ఉమ్మడి జిల్లాకు ప్రత్యేకాధికారిగా శరత్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమించింది. సీనియర్ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఐఏఎస్ శరత్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల్లో ప్రాధాన్యతను ప్రత్యేకాధికారులు పరిశీలించనున్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తున్న కాంగ్రెస్

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్, అక్టోబర్ 1: ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తూ ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, ముప్కాల్, వేల్పూర్ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు కల్లెడ ఏలియా, రాజపూర్ణానందం, రేగుంట దేవేందర్, ముస్కు భూమేశ్వర్, నాగధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోర్తాడ్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం బాల్కొండ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా ప్రొటోకాల్‌ను ఉల్లంఘించారని అన్నారు. ఎమ్మెల్యే లేకుండానే ప్రారంభోత్సవాలను పూర్తిచేయడం కాంగ్రెస్ తీరుకు నిదర్శనమన్నారు. గతనెల 30న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి సంవత్సరీకం ఉందని, ప్రభుత్వ కార్యక్రమాలు మరోరోజు పెట్టుకోవాలని తెలిపినా కాంగ్రెస్ నాయకులు వినలేదని మండిపడ్డారు. ప్రొటోకాల్ ఉల్లంఘనకు స్థానిక కాంగ్రెస్ నాయకులే కారణమని ఆరోపించారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఉన్నప్పటికీ సమాచారం ఇవ్వకుండా మంగళవారం వేల్పూర్‌లో సోయాబీన్ కొనుగోలు కేంద్రం ప్రారంభించడం సరికాదన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బద్దం రవి, సొసైటీ చైర్మన్ బద్దం అశోక్, బోగ ఆనంద్, మాజీవైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, దుగ్గెన రాజేందర్, గోపిడి సత్యనారాయణ, ఏనుగు రాజేశ్వర్, గందం మహిపాల్, ఇంతియాజ్, దేవన్న, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎన్నిక

సారంగాపూర్, అక్టోబర్ 1 : గద్వాలలో డిసెంబర్ 6న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్–14 క్రికెట్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు పీడీ రంగు కృష్ణంరాజు తెలిపారు. రూరల్ మండలంలోని సారంగాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం రాష్ట్ర జట్టు ఎంపిక కోసం క్రికెట్ పోటీలను నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.లలిత, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సల్ల సత్యనారాయణ, పీడీలు శ్రీధర్, నాగరాజు, విజేశ్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, గోపాల్, జావిద్ పాల్గొన్నారు.

బారికేడ్ల తొలగింపు

వినాయక్‌నగర్, అక్టోబర్ 1: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కుమార్ గల్లీ చౌరస్తా వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో గల్లీలోకి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనిని గమనించిన కుమార్‌గల్లీ షాప్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. తాము వ్యాపారాలు ఎలా చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేసి, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో, ట్రాఫిక్ సీఐని ఆశ్రయించారు. అనంతరం పోలీసులు అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించారు.